క్లుప్తంగా

రుద్రాక్షల అలంకరణలో రాస పోలమాంబ



రుద్రాక్షలతో అలంకరించిన రాస పోలమాంబ

తగరపువలస: మహా శివరాత్రి సందర్భంగా భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబను శుక్రవారం రుద్రాక్షలతో అలంకరించారు. నగరంలోని పూర్ణా మార్కెట్‌లో పువ్వులు విక్రయించే మహిళలు తుపాకుల అచ్చియ్యమ్మ, అప్పలనారాయణ, రాము, పార్వతి, కాగితాల అచ్చియ్యమ్మ ఈ అలంకరణతో పాటు ప్రసాదాల పంపిణీకి సహకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ వితరణ



వాటర్ ప్యూరిఫైర్‌ను అందిస్తున్న హరివర్మ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం ప్రాథమిక పాఠశాలకు కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు శుక్రవారం వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. యూనియన్ ఏపీ స్టేట్ సెక్రటరీ యు.వి.ఎస్.ఎస్.హరివర్మ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేస్తున్నామని, పిల్లలకు స్వచ్ఛమైన నీటిని అందజేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ శ్రీనివాసకుమార్, సభ్యులు మహేంద్ర, నాగోతి రవికుమార్, శ్రీనివాసరావు, డి.కె.కె. రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

మధురవాడ: పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధి గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో 10వ బ్లాక్, జీఎఫ్–1లో నివాసం ఉంటున్న షేక్ జిలానీ(38) సన్ షేడ్ మీద నుంచి సామగ్రి తీస్తుండగా జారి పడి మృతి చెందాడు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యథావిధిగా రోజు వారి పనులు ముగించుకుని వచ్చిన జిలానీ ఈ నెల 5న భార్య ఫాతిమాను భోజనం పెట్టాలని అడిగాడు . అంతలోనే పడక గదికి వెళ్లి సన్ షేడ్ మీద నుంచి ప్లంబింగ్ సామగ్రి తీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. శబ్దం రావడంతో భార్య పడక గదిలోకి వెళ్లి చూడగా నేలపై పడిపోయి ఉన్నాడు. చెవి నుంచి రక్తం కారుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో 108 వాహనంలో కేజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ జిలానీ మృతి చెందినట్టు భార్య ఫాతిమా శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కారుషెడ్ శివాలయంలో సామూహిక అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



భీమిలి యోగాశ్రమంలో సామూహిక రుద్రాభిషేకాలు



శింగనబందలో అఘోరాతో భిక్షాటన చేస్తున్న శివస్వాములు



పద్మనాభం శివాలయంలో బారులు తీరిన భక్తులు

మహాదేవా.. మనసా స్మరామి

- నీలకంఠుడికి భక్తజనుల నీరాజనం
- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి

తగరపువలస: మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్త కోటితో కళకళలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. పలు ఆలయాలలో రుద్రాభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. సంగివలస పోలమాంబ ఆలయం ఈవో బందారు ప్రసాద్ ఆధ్వర్యంలో సంగివలస ఉమా రామలింగేశ్వరాలయం, తాటితూరు ఉత్తర రామలింగేశ్వర ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

- చిట్టివలస, విల్సన్‌పేట, కొండపేట, బంగ్లామెట్ట, అమనాం, లక్ష్మీపురం, బసవపాలెం శివాలయాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.
- భీమిలి యోగాశ్రమంలో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు
- శింగనబంద పంచాయతీలో అఘోరాతో కలిసి శివస్వాములు శరణఘోషతో భిక్షాటన చేశారు.
- టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలో శ్రీకాకుళానికి చెందిన బాడాన వెంకటనాయుడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం గురించి ప్రవచనం వినిపించారు.

కొమ్మాది: 8వ వార్డు కోదండ రామాలయం షిర్డీ సాయి గణపతి పశుపతినాథేశ్వరస్వామి దేవాలయంలో శివయ్యకు సామూహిక ఏకవార అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని జరిపించారు.

- మారికవలస, కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో, భీమిలి బీచ్ రోడ్డు రామాద్రిలో మహోత్సవాలు నిర్వహించారు.



బోని శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

సామూహిక అభిషేకాలు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి సమీపంలోని శ్రీ కాశీ ఉమామహేశ్వర ఆలయంలో సామూహిక అభిషేకాలు చేశారు బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకరమఠంలోని శ్రీ ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముక్కంటికి రుద్రాభిషేకం

ఆనందపురం : గుడిలోవ, బోని, కుసులువాడ, పొడుగుపాలెం, గిడిజాల, మెట్టమీదపాలెం ఆనందపురం తదితర గ్రామాలలోని శివాలయాల్లోప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, నిర్వహించారు. గుడిలోవ నారాయణేశ్వర ఆలయం వద్ద ఆకాశగంగలో భక్తులు స్నానమాచరించి, పూజలు చేశారు.

పద్మనాభం శివాలయంలో..

పద్మనాభం: పద్మనాభం, అనంతవరం రెడ్డిపల్లి, బి.ఆర్.తాళ్లవలస, కురపల్లి, తునివలస, పొట్నూరు, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లోని శివాలయాల్లో మహాదేవుడిని అర్చించారు. రెడ్డిపల్లిలో కృష్ణ చంద్ర బాబాజీ మఠం ప్రాంగణంలోని శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఎండాడ శివాలయంలో..

న్యాయమూర్తుల ప్రత్యేక పూజలు

మధురవాడ: మధురవాడలో ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.గోవర్ధన్, స్పెషల్ పోక్సో జడ్జి జి.ఆనంద్, ఎక్సైజ్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ సింగూరు కొండబాబు, డీఎస్పీ ప్రసాదరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు వెంకటరమణ మూర్తి శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కేవీ రావు, సోమేశ్వరరావు, సాయిరాం కృష్ణ, విజయ్‌కుమార్, ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

- మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, మధురవాడ జంక్షన్‌లోని సిద్ధేశ్వర స్వామి, మారికవలస ఆర్‌జీకే కాలనీ పరిసర ప్రాంతాల్లోని ఆలయాలకు కూడా భక్తులు విశేషంగా హాజరై పూజలు చేశారు.



రామాద్రిలో ..



మానం ఆంజనేయులు కాలనీలో మహా కామేశ్వర స్వామికి పూజలు చేస్తున్న న్యాయమూర్తులు

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

మధురవాడ: పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధి మిథిలాపురి వుడా కాలనీలో ఓ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. దీనికి సంబంధించి పీఎంపాలెం క్రైం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వుడా కాలనీకి చెందిన మూకల రామ్మోహనరావు, భార్య రమణమ్మ కాలనీ రోడ్డులో శుక్రవారం సాయంత్రం వాకింగ్ చేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చి రమణమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును తెంచుకుని పరారయ్యాడు. బాధితులు తేరుకునే లోపే ఆ దొంగ వుడా కాలనీ రోడ్డులో నుంచి బింద్రానగర్ వైపు పరారయ్యాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పీఎంపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారైన రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి వెళ్లినట్లు గుర్తించినట్లు పోలీసులు చెప్పారు. మరిన్ని కెమెరాలు పరిశీలించి నిందితుడి జాడను కనుగొంటామన్నారు.

17న ఎల్లమ్మ జాతర

తగరపువలస: ఈ నెల 17న సంగివలసలో జరగనున్న ఎల్లమ్మ జాతరకు సంబంధించి శుక్రవారం పూజారి ఊళ్ల అప్పారావు ఇంటి వద్ద ఉత్సవ రాట వేశారు. 15 నుంచి చుట్టు పక్కల గ్రామాలలో మూడు రోజుల పాటు జోగి నిర్వహించి ఉత్సవం చేయనున్నారు. అనంతరం 24, 25, 26వ తేదీల్లో కొత్తమ్మ, ముత్యమాంబ, మరిడిమాంబ వార్షిక ఉత్సవాలు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. ఉత్సవరాట కార్యక్రమంలో పెద్దలు అక్కరమాని రామునాయుడు, అక్కరమాని మంగరాజు, నమ్మి అప్పలనాయుడు, సారిపల్లి మోహన్, ఊళ్ల చిన్నారావు, వంక అప్పారావు, కోల అప్పలకొండ, ఊళ్ల చిన్నా పాల్గొన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ కురపల్లి శివాలయం వద్ద శుక్రవారం రేవిడి ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్యాధికారి ఎస్ఎల్ సౌజన్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యర్థుల విమర్శలు పట్టించుకోవద్దు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మధురవాడ జోన్‌లో 15 వేలు మందికి ఇళ్ల పట్టాలు

మధురవాడ: రాజకీయ ప్రత్యర్థులు చేసే పనికి మాలిన విమర్శలు, వారి ఇచ్చే ఆచరణ సాధ్యం కాని హామీలు నమ్మవద్దని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెంలో సెంటు స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులకు శాలువాలు కప్పి సత్కరించి మరీ పట్టాలు పంపిణీ చేశారు. మధురవాడ మాజీ సర్పంచ్, 7వ వార్డు జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు ప్రభుత్వం మంజూరు చేసిన సెంటు స్థలం పట్టాను అతని చేతుల మీదుగా కుమార్తెకు అందజేసి, బాబా సాహేబ్ కల ఈ రకంగా నెరవేరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసినా కూడా అందులో లేని పోని లోపాలు గురించి ప్రతిపక్షాలు మాట్లాడుతారన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఇచ్చిన హామీలు ఎన్నికలు అయిపోయిన తర్వాతే మరిచిపోతాడన్నారు. సినిమా పార్టీని సినిమా వరకే పరిమితం చేయాలన్నారు. 7వ వార్డులో 3,800 మంది లబ్ధిదారులకు సెంటు స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తున్నామన్నారు. కేవలం మధురవాడ జోన్‌లోనే 15వేలు మందికి పట్టాలు ఇచ్చే భాగ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు కల్పించారన్నారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శైలజావల్లి, ఏపీడీ గంగాధర్, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వాండ్రాసి రవికుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగ్గుపిల్లి నరేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంట్ర అప్పన్న, జిల్లా మహిళా విభాగం నాయకురాలు ఆశాజ్యోతి, మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని, నాయకులు పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, మంగ పాల్గొన్నారు.



మహిళలను సత్కరించి పట్టాలు అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి

ఆనందపురం : మండలంలోని క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేయనున్నట్టు ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్రైస్తవ మహిళలు తర్లువాడలోని ఎంపీపీ స్వగృహంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లోని క్రైస్తవ సంఘాల మహిళలు పాల్గొన్నారు.



ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంకకు అభినందనలు తెలుపుతున్న క్రైస్తవ మహిళలు

శివతత్వాన్ని అర్థం చేసుకోవాలి

తగరపువలస: శివతత్వాన్ని, శివలీలలను అర్థం చేసుకోవడానికి భక్తి ఒక్కటే మార్గమని బ్రహ్మకుమారీలు పేర్కొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భీమిలి బీచ్‌లో శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. శివతత్వంపై వారు ప్రచారం నిర్వహించారు. ధ్యానం ద్వారా శివతత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగలమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని మొక పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, బ్రహ్మకుమారీలు సునీత, నిర్మల, లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



భీమిలి బీచ్‌లో శివతత్వంపై అవగాహన కలిగిస్తున్న బ్రహ్మకుమారీలు

అసూయతో అభివృద్ధి పనులకు టీడీపీ అడ్డుకట్ట



ఆదర్శనగర్‌లో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఇక్కడి టీడీపీ నాయకులు అడ్డు తగులుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఆదర్శనగర్ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి మాట్లాడారు. ఈ అయిదేళ్లలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో వార్డులో రూ.12.50 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆదర్శనగర్‌లో రూ.1.50 కోట్లతో వసతులు కల్పించారన్నారు. 25 ఏళ్లగా ఆదర్శనగర్‌లో అభివృద్ధి జరగని కారణంగానే వైఎస్సార్‌సీపీ చేసి చూపిస్తోందన్నారు. ఇలాంటి చోట సీసీ రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకోవడం వివేకం కాదన్నారు. ఇక్కడ ఇంటి యజమానులను బెదిరించి డబ్బులు దండుకోవడం టీడీపీ నాయకుల నైజం అని విమర్శించారు. దీనిపై చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

దిగజారి మాట్లాడితే బుద్ధి చెబుతాం

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి రైతుల మధ్య ఆస్తి తగాదాలు ఉంటే వారు పరిష్కరించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను రౌడీలు, గూండాల పేరుతో సంబోధించడం వారి ఆటవికతనానికి నిదర్శనమన్నారు. మరోమారు ఇలా దిగజారి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. స్థానిక రైతులు చేట్ల నరసింగరావు, సరగడ నాగిరెడ్డి తదితరులు మాట్లాడుతూ చిట్టివలస సర్వే నంబర్ 40/2లో ఎ.2.60 సెంట్లు స్థలాన్ని తమ పూర్వీకులైన నలుగురు 1955లో కొనుగోలు చేశారన్నారు. దీనికోసం 1956లో రూ.137కు బండి రాకపోకలు, నీటి ప్రవాహానికి అనువైన స్థలాన్ని కూడా కొనుగోలు చేశారన్నారు. ఇప్పుడు స్థానికుల కోసం సీసీ రోడ్డు నిర్మిస్తుంటే టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇదే విషయంలో గతంలో టీడీపీ నాయకులు వారి అనుచరులపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. చేట్ల అప్పయ్యమ్మ, వంశీరెడ్డి, జీరు పద్మ, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాలయంలో బైటో భజన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేట రామాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం బైటో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చిల్లపేట, జీరుపేట గ్రామాలకు చెందిన సరగడ ఆదిమూర్తి శిష్యులు మహాదేవుని కీర్తిస్తూ శనివారం వేకువజాము వరకు భజనలు చేశారు. కార్యక్రమంలో చిల్ల సూరిబాబు, సరగడ శివాంజనేయరెడ్డి, సరగడ చెన్నారెడ్డి, చిల్ల సూర్యంరెడ్డి, కొల్లి ఎర్రయ్యరెడ్డి, జీరు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఆది దంపతుల కల్యాణం

పద్మనాభం: మండలంలోని పలు శివాలయాల్లో శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం, గెద్దపేటలో సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం, మద్ది శివాలయాల్లో ఆది దంపతుల పరిణయ వేడుకను నిర్వహించారు. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాల అనంతరం కల్యాణ మహోత్సవం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, కల్యాణాన్ని వీక్షించారు.



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎల్ఎంసీలో యూత్ రిట్రీట్

తగరపువలస: చిట్టివలసలోని పురాతన లండన్ మిషన్ చర్చిలో శుక్రవారం యూత్ రిట్రీట్ క్రైస్ట్ ఇవాంజలియల్ మినిస్ట్రీస్–విశాఖ సమ్మేళనం జరిగింది. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జి.ఎలియాజర్ ఆధ్వర్యంలో వివిధ చర్చిల నుంచి యువతీ, యువకులు పాల్గొన్నారు. వీరికి అద్భుతమైన సాక్ష్యాలు నిర్వహించి క్విజ్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎల్ఎంసీ తరపున పాస్టర్ ఎం.సుబ్బారావు జాకబ్, కార్యదర్శి సుంకర కృపారావు, కోశాధికారి ఎస్.విలియమ్స్, సంఘ పెద్దలు ఆశీర్వాదం, ఆల్బర్ట్, నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మధురవాడలో జోనల్ కమిషనర్ శైలజావల్లిని సత్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శారదానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైన జోన్–2 కమిషనర్ శైలజావల్లిని సత్కరించారు.

- మధురవాడ గాయత్రి ఆస్పత్రి లో మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాయత్రి ఆస్పత్రి జనరల్ మెడిషన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాలు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. గాయత్రి విద్యా సంస్థల కార్యదర్శి పి.సోమరాజు, డీన్ డాక్టర్ ఎస్.సుబ్బారావు, ఆపరేషన్స్ డైరెక్టర్ సత్యవరప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు పాల్గొన్నారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో పీపుల్ అజెండా పేరిట చర్చా వేదిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు చూకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, సేంద్రియ వ్యవసాయ అవార్డు గ్రహీత బంగారు ఝాన్సీ, తదితరులు సమానత్వం, సమాన వేతనాలు, ప్రభుత్వాల నుంచి ఎలాంటి సదుపాయాలు, జీవోలు పొందాలి అన్న అంశాలపై చర్చించారు.
- జీవీఎంసీ 5వ వార్డు శారదానగర్‌లో ఐద్వా నాయకురాలు భారతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్. పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

తగరపువలస: ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు భీమిలిలో నిరుపేద మహిళ షేక్ అమీరాను సత్కరించారు.

- భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మరిడమ్మపేటలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డివిజన్ కార్యదర్శి కె.నాగరాణి, ఎస్.గుణ, యు.పార్వతి, ఎం.కల్యాణి, లలిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు వలందపేట రామాలయం వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులలో అయిదుగురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు పోలీసులను చూసి పారిపోవడంతో మిగిలిన అయిదుగురి నుంచి రూ.52,380 నగదు, అయిదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ దాడుల్లో భీమిలి సీఐ డి.రమేష్, ఎస్ఐ గంటా హరీష్, టాస్క్‌ఫోర్స్ సీఐ అప్పలనాయుడు, ఎస్.భరత్‌కుమార్ రాజు పాల్గొన్నారు. ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆనందపురం : మండలంలోని యర్రవానిపాలెం–సియ్యాద్రి మెరకలో శివరాత్రి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కోలాటం, వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పినిశెట్టి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కోలాటం పోటీల్లో 22 జట్లు పాల్గొనగా.. పెదగంట్యాడ, ఇచ్ఛాపురం, దేవరాపల్లి, రామవరం జట్లు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలవగా.. వారికి వరసుగా రూ.8వేలు, రూ.6వేలు. రూ.4వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వాలీవాల్ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొనగా వైజాగ్, ఎస్‌కే అకాడమీ, శంభువానిపాలెం జట్లు వరసుగా మొదట, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించగా వారికి వరుసగా రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలు చొప్పున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు సియ్యాద్రి పరదేశి నాయకులు పాల్గొన్నారు.